క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయూస్ వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని 50ఏళ్లు దాటిన వారందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య చికిత్సల అనంతరం ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. రోగులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు.

రాజీవ్ జ్యోతియాత్రను విజయవంతం చేయాలి

ఊట్కూరు/మాగనూర్/కృష్ణా: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణా బ్రిడ్జ్ ఛైరోడ్ నుంచి నిర్వహించే రాజీవ్‌గాంధీ జ్యోతియాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కొక్కు లింగం, మోహన్‌రెడ్డి, రవికుమార్, మాగనూర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు దండు ఆనంద్, కృష్ణా మండల యువజన సంఘం అధ్యక్షుడు పల్లె సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి యాత్ర ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కృష్ణా ఛైరోడ్ నుంచి మక్తల్, ఊట్కూరు, నారాయణపేట వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఆయా మండలంలోని కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మరికల్: జిల్లాలోని నాయీ బ్రాహ్మణ పురస్కారాల కోసం నాయి బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో గ్రేడ్ 9నుంచి 10 జీపీఏ, ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20లోపు మండలాల్లో ఉన్న నాయీ బ్రాహ్మణ విద్యార్థులు 9989985552, 9985441221, 9381543395 నంబర్లను సంప్రదించి దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


లక్ష బిల్వార్చన కరప్రతాల విడుదల

మరికల్: మండల కేంద్రంలోని భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు లక్ష బిల్వార్చన కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 29న నిర్వహించే ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో శివస్వాములు, గ్రామస్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగదీష్, వీరన్న, అయ్యప్ప, శివ, శేఖర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలపై రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి తెలిపారు. వరంగల్‌లో రెండు రోజులపాటు కొనసాగుతున్న రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం ఆయన పాల్గొని జిల్లాలో చేపట్టే భవిష్యత్ కార్యాచరణ రిపోర్టును రాష్ట్ర నాయకులకు అందించినట్లు పేర్కొన్నారు. మద్దూర్, ఊట్కూర్ గురుకుల స్కూల్‌లకు సొంత భవనాలు, భోజన నాణ్యతలో విఫలం, బీసీ సంక్షేమ హాస్టల్‌లలో సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలంకు సన్మానం



మక్తల్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఒలింపిక్ భవనంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆదివారం రాష్ట్ర సైక్లింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయకాంతరావు, స్పోర్ట్స్' అథారిటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి గోపాలంను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ కో–శాధికారి వెంకట్, నర్సయ్య, నిర్వహణ కార్యదర్శి దత్తాత్రేయ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి

కొత్తకోట రూరల్: భగవద్గీతలోని శ్రీకృష్ణుడు చెప్పిన మొట్టమొదటి శ్లోకంలో జ్ఞానంను గ్రహించేందుకు ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రబోధ సేవాసమితి కమిటీ పట్టణ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, మాసన్న, వేణుగోపాల్, శివ, సిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు ఉన్నారు.



పంటల సాగులో.. కలుపు భారం

- పత్తి చేలల్లో విపరీతంగా పెరిగిన కలుపు
- కూలీలకు పెరిగిన డిమాండ్.. ఎకరాకు రూ.4,500 పైనే
- పెరిగిన పెట్టుబడులతో రైతుల్లో ఆందోళన



మాద్వార్ శివారులో పత్తి పంటలో ఏపుగా పెరిగిన కలుపు

మక్తల్: ఇటీవల కురిసిన వర్షాలతో పంట చేన్లలో పెరిగిన కలుపు మొక్కలు రైతులకు తీవ్ర సమస్యగా మారింది. కలుపు తీసేందుకు కూలీలు దొరక్కపోవడంతో పంటను మించి కలుపు మొక్కలు పెరిగాయి. దీంతో రైతులకు అదనపు ఖర్చు పెరుగుతోంది. కొందరు రైతులు కలుపు తీయించినా లాభం లేదంటూ పంటలు వదిలేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ అంచనా వేసినట్లుగానే దాదాపు లక్షా 73వేల ఎకరాలకు పత్తిని సాగు చేశారు. ఈ సారి కాస్తా ఆలస్యంగానే కొంతమంది రైతులు వరిపంట సాగు చేసుకోనే వారు సైతం పత్తిసాగు చేశారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో వర్షాలు రావడంతో గింజలు మొలకెత్తాయి. ఇక పత్తి చేన్లలో గొర్రు, గుంటిక తొలే సమయం వచ్చింది. ఇక్కడి నుంచి వానమీద వాన పడటంతో పంటలు అధికంగా జాలు పట్టింది. మొదట్లో ఈ నెల 8వ తేదీ నుంచి 5రోజులపాటు ఎడతెరిపి లేకుండా ముసురు పట్టింది. తదనంతరం భూములు ఆరిన తర్వాత తొలేందుకు అనువుగా సరియైనా సమయానికి జిల్లా వ్యాప్తంగా పత్తి చేన్లలో పనులు చేసేందుకు వీలు లేకుండా పోయింది. గొర్రు, గుంటికలు, తొలక కలుపు ఏపుగా పెరిగింది. వర్షాలు తగ్గుముఖం పడితేనే పత్తి పంటల్లో కలుపు తీసేందుకు కూలీలకు ఒక్కొక్కరికి రూ. 600చెల్లించి కలుపు తీయించారు. అధికంగా వర్షాలు రావడంతో నల్లరేగడి పొలాల్లో కలుపు విపరీతంగా పెరగడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఎకరాకు రూ.4వేలు 500 వందలు ఇస్తేనే కలుపు తీస్తామని చెబుతున్నారు. కలుపు తీయగా స్థలాల్లో గొర్రు, గుంటికలు తొలకపోవడంతో ఏపుగా పెరిగిన కలుపు నివారణ వర్షాలు తగ్గుముఖం పడితేనే సాధ్యమవుతుంది. పంటలకు ఫర్టిలైజర్ మందును పెట్టిన ఫలితం లేకుండా పోయింది.

ఫలితం శూన్యం..



తాను రెండు ఎకరాల్లో వరి పంటను ప్రతి ఏటా సాగుచేశాను. అయితే పత్తి పంట దిగుబడి అధికంగా వస్తుందని ఆశతో పత్తిని సాగుచేశాం. వర్షాలు అధికంగా రావడంతో పత్తి పంటలో కలుపు వీపరితంగా ఉండి, గింజలు మొలకెత్తడంలేదని దీంతో పత్తి పంటను తొలగించి వరి పంటను సాగుచేశాం. ఏ పంటలు వేసిన ఫలితం లేకుండా పోయింది. దాదాపు రూ. 20వేల వరకు ఖర్చుచేసిన ఫలితం లేదు.

– లక్ష్మీకాంత్, మాద్వార్

పంటలో కలుపు అధికం..



తమ వ్యసాయ పొలాల్లో కంది, పత్తి పంటలు సాగుచేసిన కలుపు అధికంగా రావడంతో మొక్కలను ఎదగ నివ్వకుండా ఉండటంతో పంటలు అధికంగా రాకుండా ఉంటున్నాయి. పంటలకు పెట్టుబడి భారం మరో పక్క కలుపు భారంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కూలీలకు అధికంగా డిమాండ్ రావడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

– నాగేష్, పస్పుల

నీరు నిల్వలేకుండా చూడాలి

అధికంగా వర్షాలు కారణంగా పత్తి చేలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. రైతులు సాగు చేసిన పంట పొలాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి. నల్లరేగడి, ఇసుక పొలాల పత్తి పంటలు సాగుచేస్తే జాలు పారే పరిస్థితి ఉంటుంది. ఆ సమయంలో చిన్న పాటి కాల్వలను తీసుకుని జాగ్రత్తలు చేపట్టాలి

– మితిన్ చక్రవర్తి, వ్యవసాయ అధికారి, మక్తల్

జాతీయ జెండాను ఎగుర వేద్దాం



నర్వలో విశ్రాంత సైనికులు

నర్వ: బీజేపీ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం మండలంలోని హర్.. ఘర్.. తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి హాజరైయ్యారు. కార్యక్రమంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాలను ప్రదర్శించారు. అనంతరం జాతీయ నాయకుల విగ్రహాలను నీటితో శుభ్రం చేశారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశం కోసం ఆర్మీలో చేరి సేవలందించిన విశ్రాంత సైనికులు హన్మంతు, చెన్నప్ప, రఘులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కుర్వసత్యం, వావిళ్ల రవికుమార్‌రెడ్డి, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య, నాయకులు వెంకటేష్, నరేందర్, విజయ్‌రాం, యాదవరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

నారాయణపేట: ప్రధాని మోదీ పిలుపు మేరకు ఇంటింటా తీరంగా జెండా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జి.రఘువీర్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దేశ జాతీయ సమైక్యత పెంపొందించాలన్న ఉద్దేశంతో ప్రధాని ఈ నెల 13నుంచి 15స్వాతంత్ర దినోత్సవం వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ సమైక్యతను చాటాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: పట్టణానికి చెందిన చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం తన నివాసంలో అందజేశారు. వడ్డెశివకు రూ.60వేలు, రాజుకు రూ.42 వేలు, రఘుకు రూ.21 వేలు, జ్యోతికి రూ.7,500, ప్రభావతికి రూ.52 వేలు చెక్కులను ఇచ్చారు. వివిధ అనారోగ్యాలతో ఆసుపత్రుల్లోచేరి చికిత్సలు చేయించుకున్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పరమేష్, శ్రీనివాసులు, షబ్బీర్‌అహ్మద్, ఇమ్రాన్, రఘు, రఫి, నిరంజన్, రాజశేఖర్, ఖాజ, హుస్సేన్‌మియ్య, చాంద్‌పాష, ఉన్నారు.

వధూవరులనుఆశీర్వదించిన ఎమ్మెల్యే

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో ఆదివారం మాజీ సర్పంచ్ మాణిక్యమ్మ మనుమరాలు అక్షర, శ్రీధర్ వివాహాల వేడుకల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు నాయకులు చంద్రకాంత్‌గౌడ్, కోళ్ల వెంకటేష్, కతలప్ప, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, రవి కుమార్, బసవరాజుగౌడ్, మణెమ్మ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: మండలంలోని మొగల్‌మడ్క గ్రామానికి చెందిన ముగ్గురు వలస కూలీలు మహారాష్ట్రలోని నాసిక్‌లో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. గత ఆదివారం నాసిక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వెంకటప్ప, మొగులప్ప, పాపరాజు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆయనతోపాటు స్థానిక బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, నాయకులు భీమయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మహిపాల్, సాయిలుగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు విష్ణుకాంత్ రెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి ఆకాలంగా మృతి చెందడంతో ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం కుమారుడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతయ్య, బసంత్, గోవర్ధన్, రవి, మల్లేష్, సత్యనారాయణరెడ్డి, నరహరి, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

సంపదను దోచుకోవడమే 'ప్రజాపాలన'



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మాగనూర్: ప్రజా పాలన పేరుతో అధికార పార్టీ నాయకులు అక్రమ ఇసుక దందాలతో ప్రభుత్వ సంపదను దోచుకుంటుందన్నారు బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాసు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. వర్కూర్ గ్రామాల పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ కోట్ల రూపాయాలు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరిస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇటుక బట్టీల యాజమానులతో వసూళ్లు చేస్తున్నారన్నారు. త్వరలోనే అధికార పార్టీ నాయకుల బాగోతాలు ప్రజల ముందు పెడుతామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బండారి చంద్రశేఖర్, గువ్వల తిరుపతి, పాలెం వెంకటయ్య, నగరం రమేష్, శ్రీనివాసులు, నీలారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వెండి విగ్రహం వితరణ



మద్దూరు: మండలంలోని రెనివట్ల ఆంజనేయ స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన గడ్డమీది తిప్పన్న కుటుంబ సభ్యులు 3.5 కేజీల వెండి ఆంజనేయస్వామి విగ్రహానికి వితరణ అందజేశారు. శ్రావణమాస మొదటి శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారి ఆలయంపై విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శనివారం రాత్రి జరిగిన రథోత్సవం సందర్భంగా వెండి విగ్రహాన్ని రథంలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కన్కప్ప, నారాయణ, గోవిందు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ. 25,500 బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

ప్రార్థన సమయంలో ప్రతిజ్ఞ చేయాలి

నారాయణపేట రూరల్: మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలపై నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను సోమవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించాలని ఏఎంఓ విద్యాసాగర్ తెలిపారు. అన్ని యూపీఎస్, హైస్కూల్‌లలో ఉదయం నిర్వహించే ప్రార్థనలోనే విద్యార్థులతో చెప్పించి విషయాన్ని పూర్తిగా వివరించాలని సూచించారు. ప్రతిజ్ఞ చెప్పిన వారికి ఈ సర్టిఫికేట్ అందించాలన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నర్వ: నేటి నుంచి ఉందేకోడ్ గ్రామ ధనలక్ష్మీ మాత నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12న ఉదయం నుంచి కలశపూజ, గణపతి పూజ, పుణ్యావచనం, జలాధివాసం, 13న ధాన్యాదివాసం, నవగ్రహ హోమం, 14న ఏకాదశి రోజు, ఉదయం 7గంటలకు 108 కలశాలతో పంచామృతాభిషేకం, శ్రీ ధనలక్ష్మీ అమ్మవారి యంత్రస్థాపన ఉదయం 10:45 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామన్నారు. విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సమాన హక్కులు, సంపద కలిగిన సమాజానికి కృషిచేద్దాం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాము

నారాయణపేట: నేటి పెట్టుబడుదారి సమాజంలో ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, సమాన సంపద ఉండవని.. శ్రమకు తగ్గఫలితం అందజే సమసమాజానికి అందరం పోరాటం చేయాలని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. ఆదివారం రాజకీయ శిక్షణ తరగతులు మండలంలోని కోటకొండలో నిర్వహించారు. ఈ క్లాసులకు డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ ప్రారంభించి ఉపన్యాసం చేయగా చారిత్రక భౌతిక వాదం అనే క్లాసును బి.రాము బోధించారు. ప్రస్తుత పెట్టుబడి దారి సమాజంలో మనిషి నాగరికంలో ఎంత అభివృద్ధి జరిగినా దోపిడీ రోజుకు రోజుకి ఎక్కువ అవుతుందన్నారు. సంపద కోసం అధికారాన్ని మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారన్నారు. ఈ సమాజం కులాలు, మతాలు స్త్రీ పురుష అసమానతలతో, ధనిక పేద అంతరాలతో నిండిపోయి కూలిపోయిందన్నారు. ఈ సమాజంలో విద్య, వైద్య, అధికారం సంపద అని అందరికీ దక్కాలంటే చైతన్యవంతమైన మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో దోపిడీ వ్యవస్థను కూల్చడం కోసం ప్రజలు ఏకం కావాలన్నారు. ఈ క్లాసులలో పార్టీ జిల్లా నాయకులు యాదగిరి, కాళేశ్వర్, విజయలక్ష్మి, బి. రాము, డివిజన్ నాయకులు, నర్సింహులు, ప్రశాంత్, నారాయణ, సాయికుమార్, అంజి, ఏ.నర్సింహా, బాలకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..



సమావేశంలో మాట్లాడుతున్న కొండన్న

ధన్వాడ: కార్మికుల భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో కార్మిక సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి డ్రైవర్ల జీవితాన్ని ఉరితాళ్లుగా మార్చిందన్నారు. సంక్షేమ బోర్డు లేకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలకు గురై దుర్భర జీవితం అనుభవిస్తున్నారని తెలిపారు. బ్యాంక్ ఫైనాన్స్, ఆర్టీఓల విచ్చలవిడి పన్నులు, ట్యాక్సీల రూపంలో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపుతున్నారని, లైసెన్సుల నవరణల పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. కార్మికులకు నెలకు 12వేల జీవన భృతి అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, భానుచందర్, కథలప్ప, సురేష్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



విద్యార్థులతో కరాటే మాస్టర్లు

నారాయణపేట: హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ నేషనల్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌సిప్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రానికి మాస్టర్ కేశవ్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ అశోక్‌తో శిక్షణ పొందుతున్న శివశంకర్, రిత్విక్, అద్వైత్, ఎం. అఖిల్ బంగారు పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నేపాల్ గ్రాండ్ మాస్టర్ సురేంద్ర శ్రేష్ఠ, భూటాన్ గ్రాండ్ మాస్టర్ రాకేష్‌కుమార్, కరాటే అకాడమీ ఫౌండర్ కేశవ్‌గౌడ్, కింగ్ షోటోకాన్ కరాటే అకాడమీ ఫౌండర్ జహంగీర్ భాషా ఖాద్రి, కోచ్ అశోక్, సత్య, అమర్‌సింగ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాసచారి పాల్గొని పతకాలు అందజేసి అభినందించారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్: స్థానిక శ్రీసాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతమైంది. ధన్వంతరి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, పరమేష్, మహేష్, రాఘవేంద్ర ముఖ్య అతిథులుగా హాజరై ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. దీర్ఘ కాలిక రోగాలు, సీజనల్ వ్యాధులు, అపరిశుభ్రతతో వచ్చే రోగాలు, నివారణ విషయాలను తెలియజేశారు. అటు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు చెప్పాలన్నారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, థైరాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. సమావేశంలో నర్సింగ్, జమీర్, చింతలయ్య, సత్య కుమార్, గోపాల్, వెంకట్రాములు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయానికి పాదయాత్ర



ఆలయానికి చేరుకున్న యువకులు

మరికల్: మండల కేంద్రానికి చెందిన యువకులు శ్రావణమాసం సందర్భంగా ఆదివారం కోయిల్‌కొండ మండలంలోని వీరభద్రస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. లోక కల్యాణం కోసం ప్రతి ఏడాది శ్రావణమాసంలో వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని పాదయాత్ర సభ్యులు మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గౌరిశంకర్, శేఖర్, రఘు, రాము, రమేష్ వీరశేఖర్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి..



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాగనూర్: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన విజయోత్సవ సభ, ర్యాలీను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ అన్నారు. ఆదివారం వారు స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు.. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేయడంతో, సుప్రీం కోర్టులో అనుకూలమైన తీర్పు వెలువడిందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న ఢిల్లీ నుంచి వస్తున్న మంద కృష్ణకు ఘన స్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీ, అనంతరం జరిగే సభకు మాదిగ ఉద్యోగులు, మాదిగ సోదరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గజపతి, పెదింటి లక్ష్మణ్, వెంకటయ్య, వాబయ్య, పరమేష్, రాహుల్, నవీన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

అమరచింత: ట్రాఫిక్ నియమాలను పాటించపోతే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారని, మైనర్ బాలలకు వాహనాలను ఇస్తున్నారని, త్రిపుల్ రైడింగ్ చేయ్యడం అలవాటుగా మార్చుకున్న వారిపై ఇక నుంచి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధన్వాడ: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి 2001వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వాహించారు. ఆదివారం ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అందరూ ఎంతో ఉల్లాసంగా కొన్ని గంటల పాటు అక్కడే గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు రతన్‌పాన్‌రెడ్డి, విఠలారావు, పాపిరెడ్డి, రామాచారి, నాగరత్నమ్మ, నరేందర్, శ్రీదేవి, జయరాములను శాలువాతో సన్మానం చేశారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు